సాక్షి ఆదిలాబాద్

బుధవారం ׀ 10 ׀ జనవరి ׀ 2024



రైల్వేస్టేషన్ అభివృద్ధికి చర్యలు

అమృత్ భారత్ పథకం కింద ఎంపికైన ఆదిలాబాద్ రైల్వేస్టేషన్ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని దక్షిణ మధ్య రైల్వే ఏజీఎం ఆర్.ధనుంజయులు అన్నారు. 8లో ▸

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నేషనల్ హెల్త్ మిషన్ పీఎం జన్ మాన్ పథకంలో భాగంగా 5 మెడికల్ ఆఫీసర్, 5 ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ధరఖాస్తు ఫారం, పూర్తి వివరాలు http://adilabad.telangana.gov.in వెబ్‌సైట్‌లో ఉంచినట్లు ఆయన పేర్కొన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.3/18.4

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. చలి ప్రభావం తగ్గుతుంది.

న్యూస్‌రీల్

దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పకడ్బందీగా నమోదు చేయాలి



వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్

ఇంద్రవెల్లి: ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పకడ్బందీగా నమోదు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ ఖుష్బుగుప్తా అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి ప్రజాపాలన దరఖాస్తులతో పాటు ఆన్‌లైన్ నమోదు వివరాలు అడిగి తెలుసుకున్నారు. మొత్తం 12,272 దరఖాస్తులు రాగా 4,630 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రతీ దరఖాస్తును ఆన్‌లైన్ చేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు పూర్తి సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పుష్పలత, ఎంపీవో సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి

కైలాస్‌నగర్: సంక్రాంతి నేపథ్యంలో రేషన్ డీలర్లు సమయ పాలన పాటిస్తూ ప్రజలకు పారదర్శకంగా బియ్యం పంపిణీ చేయాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ పట్టణంలోని నీలానగర్, ఖుర్షీద్‌నగర్‌లోని చౌక ధరల దుకాణాలను తనిఖీ చేశారు. ఆయా షాపుల పరిధిలో ఈకేవైసీ నమోదు తీరుపై డీలర్లు భగత్ మధుకర్, దాసరి రేఖలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కిరణ్ కుమార్, డెప్యూటీ తహసీల్దార్ బాబుసింగ్, తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలి



మాట్లాడుతున్న డీఐఈవో రవీందర్

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలోని ఇంటర్ విద్యార్థులకు మెరుగైన విద్యానందించాలని జిల్లా మాధ్యమిక విద్యాధికారి రవీందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో విద్యా ప్రమాణాలు పెంచడానికి ప్రతీ అధ్యాపకుడు కష్టపడాలని సూచించారు. కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. ఆయన వెంట సీనియర్ ప్రిన్సిపాళ్లు రాథోడ్ గణేశ్, భగవాండ్లు, కళాశాల ప్రిన్సిపాల్ మహేందర్ కుమార్ ఉన్నారు.

గురుకృప దినోత్సవం ఘనంగా నిర్వహించాలి



ఏర్పాట్లు పరిశీలిస్తున్న రాథోడ్ జనార్దన్

నార్నూర్: కొత్తపల్లి–హెచ్ గ్రామంలోని జాతీయ బంజారా దీక్ష భూమి వద్ద ఈ నెల 11న గురుకృప దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని జెడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. మంగళవారం కమిటీ అధ్యక్షుడు జాదవ్ రెడ్డినాయక్‌తో కలిసి ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహారాష్ట్రలోని పౌరదేవి పుణ్యక్షేత్రం తర్వాత బంజారాల రెండో ఆరాధ్య పుణ్యక్షేత్రం కొత్తపల్లి–హెచ్ జాతీయ బంజారా దీక్ష భూమి అన్నారు. లంబాడీ గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడాలన్నారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ అడే సురేశ్, వైస్ ఎంపీపీ జాదవ్ చంద్రశేఖర్, కమిటీ సభ్యులు రాథోడ్ రామేశ్వర్, రాథోడ్ రమేశ్, నరహరి, తదితరులు ఉన్నారు.



రేషన్‌కార్డు కోసం దరఖాస్తు అందజేస్తున్న మహిళ

ఆ దరఖాస్తులు పక్కకే?

- రేషన్ కార్డులు, ఇతర సమస్యలపై 29,160 అర్జీలు
- ప్రభుత్వ ఆదేశాలు లేక ఆన్‌లైన్ చేయని అధికారులు
- స్పష్టత వచ్చాకే రిజిస్ట్రేషన్ చేస్తామంటున్న సిబ్బంది..

కైలాస్‌నగర్: తెలంగాణ ప్రభుత్వం గతేడాది డిసెంబర్ 28 నుంచి జనవరి 6వరకు ప్రజా పాలనలో భాగంగా ఇతర పథకాల కోసం స్వీకరించిన దరఖాస్తుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. అభయహస్తం ఆరు గ్యారంటీల అమల్లో భాగంగా అందిన దరఖాస్తుల వివరాలను ప్రజాపాలన వెబ్‌సైట్‌లో నమోదు చేస్తుండగా ఇతర పథకాల కోసం అందిన దరఖాస్తులను మాత్రం నమోదు చేయడం లేదు. ఆ దరఖాస్తులపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత రాకపోవడంతో అధికారులు వాటిని పక్కన పెట్టేశారు. దీంతో స్వీకరణతోనే సరిపెట్టారా? ఆ దరఖాస్తులు బుట్టదాఖలేనా? అనే సందేహాలు తలెత్తుతున్నాయి. ఇతర పథకాల దరఖాస్తుల్లో అత్యధికంగా రేషన్‌కార్డుల కోసమే వచ్చినట్లుగా అధికారులు చెబుతున్నారు. కార్డుల జారీపై ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో దరఖాస్తుదారులు ఆందోళనకు గురవుతున్నారు.

స్వీకరణతోనే సరిపెట్టారా...

జిల్లాలోని 468 గ్రామ పంచాయతీలు, ఆదిలాబాద్ మున్సిపాలిటీలోని 49 వార్డుల్లో గ్రామ, వార్డు సభలను నిర్వహించిన అధికారులు అభయహస్తంలోని ఐదు పథకాల కోసం దరఖాస్తులు స్వీకరించారు. వాటి వివరాలను ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేయడంతో పాటు దరఖాస్తుదారులకు రశీదులు అందజేశారు. అయితే అందులో రేషన్‌కార్డుల వివరాలు లేకపోవడంతో తెల్ల కాగితంపై ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరించారు. దీంతో జిల్లా వ్యాప్తంగా 29,160 మంది ఇతర సమస్యలపై దరఖాస్తులు అందజేశారు. 17 మండలాల పరిధిలో 28,792 దరఖాస్తులు అందగా ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలో 368 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో అత్యధికంగా రేషన్ కార్డుల కోసమే వచ్చినట్లుగా అధికారులు చెబుతున్నారు. అయితే ప్రజాపాలన దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తుండగా ఇతర పథకాల దరఖాస్తులను మాత్రం పక్కన పెట్టేశారు. ప్రభుత్వం నుంచి వాటిపై ఎలాంటి స్పష్టమైన ఆదేశాలు రాకపోవడంతో అధికారులు వాటి జోలికి వెళ్లడం లేదు.

కార్యాలయాల్లోనే ...

ఇతర పథకాల కోసం అందిన దరఖాస్తుల్లో అత్యధికంగా రేషన్‌కార్డులకు సంబంధించినవే ఉన్నాయి. కొత్తగా రేషన్ కార్డుల జారీ, రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు, కార్డుల్లో కొత్త వారి పేర్ల నమోదు వంటి వాటి కోసమే తెల్లకాగితంపై ప్రజలు దరఖాస్తులను అందజేసినట్లుగా అధికారులు చెబుతున్నారు. అయితే వాటి వివరాల నమోదుకు ప్రభుత్వం ఎలాంటి మార్గదర్శకాలు జారీ చేయకపోవడం, ప్రజా పాలన వెబ్‌సైట్‌లో రేషన్ కార్డుల వివరాలు లేకపోవడంతో ఇలా స్వీకరించిన దరఖాస్తులన్ని కార్యాలయాల్లోనే మూలన పెట్టేశారు. కొంతమంది పంచాయతీ కార్యదర్శులు తమ గ్రామ పంచాయతీల్లోనే భద్రపర్చగా మరికొందరూ ఎంపీడీఓ కార్యాలయాలకు తీసుకువచ్చారు. కానీ వివరాలను నమోదు చేసే అవకాశం లేకపోవడంతో మూటకట్టి పక్కన పెట్టారు. వాటి కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఆందోళనకు గురవుతున్నారు. అయితే త్వరలోనే ప్రభుత్వం రేషన్ కార్డుల కోసం స్పష్టమైన ప్రొఫార్మాతో దరఖాస్తులను స్వీకరించనుందని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం ఆదేశాలు జారీచేసే వరకు ఆ దరఖాస్తుదారులకు నిరీక్షణ తప్పదు .

గ్రామాల వారీగా ఇతర పథకాల కోసం అందిన దరఖాస్తులు

మండలం	గ్రామాలు	దరఖాస్తులు
ఆదిలాబాద్‌రూరల్	34	1,018
బజార్‌హత్నూర్	30	2,275
బేల	37	1,684
భీంపూర్	26	1,448
బోథ్	33	2,834
గాదిగూడ	25	758
గుడిహత్నూర్	26	2,177
ఇచ్చోడ	32	3026
ఇంద్రవెల్లి	28	2,352
జైనథ్	42	1,189
మావల	03	240
నార్నూర్	23	1,205
నేరడిగొండ	32	1,571
సిరికొండ	19	1,251
తలమడుగు	28	2,801
తాంసి	13	892
ఉట్నూర్	37	2,071
మొత్తం	468	28,792
మున్సిపాలిటీ	వార్డులు	దరఖాస్తులు
ఆదిలాబాద్ పట్టణం	49	368

ప్రభుత్వ ఆదేశాలు లేకనే..

ప్రభుత్వ ఆదేశాల మేరకు అభయహస్తంలోని అయిదు గ్యారంటీల హామీల దరఖాస్తులను మాత్రమే ప్రస్తుతం ప్రజాపాలన వెబ్‌సైట్‌లో నమోదు చేస్తున్నాం. అయితే తెల్ల కాగితంపై అందిన ఇతర పథకాల దరఖాస్తుల ఆన్‌లైన్‌పై ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో కార్యాలయాల్లో భద్రపరిచాం. దరఖాస్తుదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వాటిపై తగుచర్యలు తీసుకుంటాం.

– రాథోడ్ రాజేశ్వర్, జెడ్పీ డెప్యూటీ సీఈవో

బీజేఎల్‌పీ రేసులో 'పాయల్'

- బీసీ కోటాలో ఛాన్స్ ఇవ్వాలని కోరిన ఆదిలాబాద్ ఎమ్మెల్యే
- పార్టీ నిర్ణయంపై ఆసక్తి



ఎమ్మెల్యే పాయల్ శంకర్

సాక్షి, ఆదిలాబాద్: బీజేపీ శాసనసభ పక్ష నేత రేసులో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ నిలిచారు. బీసీ నేతగా తనకు అవకాశం ఇవ్వాలని కోరిన నేపథ్యంలో పార్టీ పరిశీలన చేస్తోంది. పార్టీ జాతీయ అ ధ్యక్షుడు నడ్డా నుంచి నిర్ణయం వెలువడాల్సి ఉంది. మొదటిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన పాయల్ శంకర్‌కు ఈ అవకాశం దక్కుతుందా అనేది ఆసక్తికరమే.

ఎమ్మెల్యేల అభిప్రాయ సేకరణ..

బీజేపీ నుంచి శాసనసభకు ఎన్నికైన ఎమ్మెల్యేల నుంచి పార్టీ సోమవారం హైదరాబాద్‌లో అభిప్రాయ సేకరణ చేసింది. రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన కోర్ కమిటీ సమావేశంలో ఒక్కో ఎమ్మెల్యే నుంచి అభిప్రాయ సేకరణ చేశారు. పార్టీ పరంగా సిర్పూర్ నుంచి పాల్వాయి హరీశ్ బాబు, ఆదిలాబాద్ నుంచి పాయల్ శంకర్, నిర్మల్ నుంచి ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ముథోల్ నుంచి రామారావు పటేల్, ఆర్మూర్ నుంచి పైడి రాకేశ్‌రెడ్డి, కామారెడ్డి నుంచి కె.వెంకటరమణారెడ్డి, నిజామాబాద్ అర్బన్ నుంచి ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, గోషామహల్ నుంచి టి.రాజా సింగ్ గెలుపొందారు. రాజాసింగ్, ఏలేటి మహేశ్వర్ రెడ్డి మినహా మిగితా అందరు మొదటిసారి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారు. ఈ అభిప్రాయ సేకరణలో పలువురు ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పేరు సూచించినట్లు సమాచారం. కేసీఆర్, రేవంత్‌రెడ్డిలను ఓడగొట్టడం ద్వారా జాతీయంగా పేరు సాధించిన కామారెడ్డి ఎమ్మెల్యే కె.వెంకటరమణారెడ్డిని ఎల్‌పీ నేతగా చేస్తే ఎలా ఉంటుందనే విషయంలో కూడా తరుణ్‌చుగ్ అభిప్రాయ సేకరణ చేశారు. ఈ నేపథ్యంలో ఎవరు బీజేఎల్పీ నేతగా అవుతారనేది ఆసక్తిగా మారింది.

అవకాశం దక్కేనా..

బీసీ నేతగా తనకు అవకాశం ఇవ్వాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కోర్ కమిటీ సమావేశంలో నేతలను కోరిన ఈ నేపథ్యంలో పార్టీ అభిప్రాయ సేకరణలో ఏలేటి మహేశ్వర్ రెడ్డి, వెంకటరమణారెడ్డి పేర్లతో పాటు పాయల్ శంకర్ పేరును కూడా ప్రతిపాదనలోకి తీసుకున్నారు. ఎన్నికలకు ముందు రాష్ట్రంలో పార్టీ గెలిస్తే బీసీని ముఖ్యమంత్రిని చేస్తామని హామీ ఇచ్చిన నేపథ్యంలో బీజేఎల్పీ నేతగా బీసీకి అవకాశం ఇవ్వాలని పార్టీ భావిస్తే మాత్రం పాయల్ శంకర్‌కు అవకాశం దక్కుతుందన్న అభిప్రాయం లేకపోలేదు. కాగా ఎమ్మెల్యేల నుంచి సేకరించిన అభిప్రాయాలను పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డాకు నివేదించడం జరుగుతుందని, అక్కడి నుంచే నిర్ణయం వెలబడుతుందని ముఖ్య నేతలు తెలిపారు. ఇదిలా ఉంటే అసెంబ్లీ మొదటి సమావేశం బీజేపీ పార్టీ పరంగా ఎల్పీ లీడర్ లేకుండానే కొనసాగింది. త్వరలో బడ్జెట్ సెషన్ సమావేశాలకు ముందే ఈ ప్రక్రియ పూర్తి చేయాలని పార్టీ కసరత్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో త్వరలోనే ఎల్పీ నేత ఎంపిక జరగనుంది. మరి పాయల్ శంకర్‌కు అవకాశం దక్కుతుందా.. లేదా అనేది చూడాల్సిందే.

సమస్యల పరిష్కారానికి పోరాటాలు

- సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్



మాట్లాడుతున్న దర్శనాల మల్లేశ్

ఎదులాపురం: జిల్లా అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి కలిసి వచ్చే పార్టీలు, సంఘాలను కలుపుకుని పోరాటాలు చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవన్‌లో ఈ నెల 10న నిర్వహించనున్న సీపీఎం జిల్లా ప్లీనరీ సమావేశంలో జిల్లా అభివృద్ధి గురించి చర్చించనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారంటీల అమలు, ఏళ్లుగా జిల్లా ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘ చర్చ ఉంటుందన్నారు. సీసీఐ పునర్ ప్రారంభించాలని, ఆదిలాబాద్ నుండి ఆర్మూర్ వరకు రైల్వేలైన్, విమానాశ్రయం, టెక్స్‌టైల్ పార్కు, మ్యాంగనీస్ ఆధారిత ఉక్కు పరిశ్రమలు, జిల్లా అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై తీర్మానాలు చేసి వాటి అమలు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చేందుకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు బండి దత్తాత్రేయ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అన్నమొల్ల కిరణ్, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ఆశన్న, ఆర్.మంజుల, తదితరులు పాల్గొన్నారు.

'జీవో ప్రకారం వేతనాలు ఇవ్వాలి'



మాట్లాడుతున్న విలాస్

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లో పనిచేస్తున్న కార్మికులకు జీవో 60 ప్రకారం వేతనాలు ఇవ్వకుంటే ఉద్యమిస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్ అన్నారు. మంగళవారం రిమ్స్‌లో మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఎంప్లాయిస్‌కు సంబంధించి కృష్ణ కన్‌స్ట్రక్షన్స్ ఏజెన్సీ నిర్వహణ చేపడుతుందన్నారు. కార్మికులకు నిబంధనల ప్రకారం వేతనాలు ఇవ్వకుండా వేతనాల్లో కోత విధిస్తున్నారన్నారు. డీఎంఈ సర్క్యులర్ జారీ చేసినా వేతనాలు సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. జీవో ప్రకారం రూ.15,600 చెల్లించాల్సి ఉండగా రూ.11వేలు మాత్రమే ఇస్తున్నారన్నారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు వెంకటేశ్, ప్రశాంత్, దేవేందర్, శ్రీను, రమేశ్, సురేశ్, ఇమ్రాన్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్‌లో టీ–హబ్ ఏర్పాటు

- నేడు పరిశీలించనున్న వైద్యశాఖ కమిషనర్

ఆదిలాబాద్‌టౌన్: ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఉట్నూర్ ఆస్పత్రికి టీ–హబ్ మంజూరు చేసింది. ఇప్పటికే ఐటీడీఏ నిధులతో ఆస్పత్రి ఆవరణలో భవనం నిర్మించినా ఇంకా ఆస్పత్రికి కేటాయించలేదు. టీ–హబ్ ఏర్పాటుకు కావాల్సిన పరికరాలు, అక్కడ ఉన్న వసతులను పరిశీలించేందుకు వైద్యారోగ్య శాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ బుధవారం ఉట్నూర్‌కు రానున్నారు. టీ–హబ్ ఏర్పాటు చేయడంతో 57 రకాల పరీక్షలు అందుబాటులోకి రానున్నాయి. ఐటీడీఏ పరిధిలోని ఉట్నూర్, నార్నూర్, గాదిగూడ, ఇంద్రవెల్లి, సిరికొండ, జైనూర్ పీహెచ్‌సీల నుంచి రిమ్స్ టీ–హబ్‌కు రోజుకు 100 నుంచి 150 వరకు శాంపిల్స్ వస్తున్నాయి. వీటిని పరీక్షించి పంపడానికి 24 గంటల సమయం పడుతుంది. సిబ్బందిపై అదనపు భారం కూడా పడుతోంది.

క్రీడలతోనే మానసికోల్లాసం

జైనథ్: క్రీడలతోనే మానసికోల్లాసం సాధ్యమని జిల్లా విద్యాధికారి ప్రణీత అన్నారు. మంగళవారం మండలంలోని కాన్పమేడిగూడ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో విద్యార్థులకు నిర్వహించిన క్రీడా, సాంస్కృతిక, క్విజ్ పోటీలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పొద్దుటూరి లక్ష్మారెడ్డి, కాంప్లెక్స్ కార్యదర్శి రాంచందర్, సెక్టోరల్ అధికారులు నర్సయ్య, నారాయణ, శ్రీకాంత్, జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యవాన్ చిక్టే, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు



ఈ చిత్రంలో తన పిల్లలతో కనిపిస్తున్న మహిళ పేరు పెంటపర్తి సంగీత. వీరిది భీంపూర్ మండలంలోని గుబిడిపల్లి. ఈమె భర్త సంతోష్ పదేళ్లుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఎలాంటి పనులు చేయలేకపోవడంతో అన్నీతానై కుటుంబానికి అండగా నిలిచింది. ఈక్రమంలో దయాలసిస్ సైతం అవసరం ఉండటంతో రెండు రోజుల కోసారి ఆస్పత్రికి తీసుకెళ్లింది. కానీ పరిస్థితి చేయి దాటిపోవడంతో సంతోష్ పదిహేను రోజుల క్రితం మృతి చెందాడు. చేతిలో చిల్లిగవ్వ కూడా లేకపోవడంతో పిల్లలను ఎలా పెంచేదని సంగీత ఆవేదన వ్యక్తం చేస్తోంది.

ఆ ఊళ్లో కిడ్నీలు ఫెయిల్!

- గుబిడిపల్లిని వేధిస్తున్న కిడ్నీ వ్యాధి
- రెండేళ్ల వ్యవధిలో ఆరుగురు మృతి
- ప్రస్తుతం వ్యాధితో బాధపడుతున్న పలువురు..
- నీటితోనే సమస్య అంటున్న గ్రామస్తులు
- పట్టించుకోని అధికారులు, వైద్యసిబ్బంది



గుబిడిపల్లి గ్రామం

తాంసి: భీంపూర్ మండలంలోని గుబిడిపల్లిని కిడ్నీ సంబంధిత వ్యాధి వేధిస్తోంది. రెండేళ్ల వ్యవధిలోనే గ్రామానికి చెందిన ఆరుగురు మృతి చెందగా పలువురు వ్యాధితో బాధపడుతున్నారు. గ్రామంలో దాదాపు 100 కుటుంబాలు, 300కు పైగా జనాభా నివాసం ఉంటున్నారు. గ్రామస్తులంతా వ్యవసాయంతో పాటు కూలీ పనులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. తాము తాగుతున్న నీటివల్లనా? లేక ఆహారపు అలవాట్లా? ఇతర కారణాల చేత కిడ్నీ వ్యాధులు సోకుతున్నాయో తెలియక గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గ్రామస్తులంతా గ్రామ సమీపంలోని బోరుబావి నీటిని తాగునీటి అవసరాలకు వినియోగిస్తారు. ఇప్పటికే అధికారులు నీటికి క్లోరైడ్ పరీక్షలు నిర్వహించగా సాధారణంగా ఉన్నట్లు తెలిపారు. కొంతమంది గ్రామానికి సమీపంలో ఉన్న కప్పర్ల, జామిడి నుంచి మినరల్ వాటర్‌ను సైతం ద్విచక్ర వాహనాలపై తీసుకెళ్తున్నారు.

రెండేళ్ల వ్యవధిలో ఆరుగురు మృతి

రెండేళ్ల వ్యవధిలోనే గ్రామానికి చెందిన ఆరుగురు కిడ్నీ సంబంధిత వ్యాధితో మృతి చెందినట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. గ్రామానికి చెందిన తొడసం దాదారావు, గంగమ్మ, రామన్న, డి.ఇస్తారి, దేవమ్మ, లలితకు కిడ్నీ సంబంధిత వ్యాధి సోకి మృతి చెందగా పలువురు వ్యాధితో బాధపడుతున్నారు. ప్రస్తుతం గ్రామంలోని ఆశమ్మ, భూమన్న నిత్యం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో దయాలసిస్ చేయించుకుంటున్నారు. గ్రామానికి సరైన రోడ్డు, వాహన సౌకర్యం లేకపోవడంతో ప్రత్యేకంగా ఆటోకు రూ.500 చెల్లించి ఆస్పత్రికి వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు వైద్య శాఖ ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించలేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా వైద్యశాఖతో పాటు సంబంధిత శాఖల అధికారులు గ్రామాన్ని సందర్శించి వ్యాధికి గల కారణాలు తెలియజేస్తే వ్యాధి బారిన పడకుండా జాగ్రత్తపడే అవకాశం ఉంది.

గ్రామాన్ని సందర్శిస్తాం

గుబిడిపల్లిలో కిడ్నీ సంబంధిత వ్యాధి అధికంగా వస్తుందని ఇప్పటికే మా దృష్టికి వచ్చింది. కిడ్నీ వ్యాధి సోకడానికి గల కారణాలు తెలుసుకునేందుకు గ్రామాన్ని సందర్శించి ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేస్తాం. గ్రామస్తుల ఆహారపు అలవాట్లతో పాటు తాగే నీటిని పరీక్ష చేస్తే కిడ్నీ వ్యాధికి గల కారణాలు తెలిసే అవకాశం ఉంది.

– నిఖిల్ రాజ్, వైద్యాధికారి, భీంపూర్

డయాలసిస్ చేయించుకుంటున్నా..



రెండేళ్ల క్రితం అనారోగ్యానికి గురయ్యా. ఆస్పత్రికి వెళ్తే పరీక్షలు చేసి కిడ్నీ చెడిపోయిందని చెప్పారు. గత సంవత్సరం నుంచి డయాలసిస్ చేస్తున్నారు. ప్రస్తుతం రెండు రోజులకోసారి అతికష్టం మీద రిమ్స్‌కు వెళ్లి డయాలసిస్ చేయించుకుంటున్నా. చివరి దశలో ఆస్పత్రికి వెళ్తే కిడ్నీ వ్యాధి సోకిందని తెలుస్తోంది.

– ఎమ్.భూమన్న, గుబిడిపల్లి

మినరల్ వాటర్ తెస్తున్నా



బోరు బావి నీటితోనే కిడ్నీ వ్యాధి సోకుతోందని అందరూ భయాందోళన చెందుతున్నారు. దీంతో ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న కప్పర్ల నుంచి మినరల్ వాటర్ తెచ్చుకుంటున్నా. బోరు బావి నీటిని తాగడం మానేశాం.

– సంజీవ్, గుబిడిపల్లి

వైద్యపరీక్షలు నిర్వహించాలి



గ్రామంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులు పెరుగుతున్నప్పటికీ వ్యాధి నిర్ధారణకు ఎలాంటి వైద్యపరీక్షలు చేయలేదు. బోరుబావి నీటిని సైతం మరోసారి పరీక్షిస్తే వ్యాధికి గల కారణాలు తెలిసే అవకాశం ఉంది. అధికారులు త్వరగా పరిష్కారం చూపాలి.

– సూర్పం గజానన్, గ్రామస్తుడు

క్లుప్తంగా

మంత్రిని కలిసిన బాసర ఆలయ ఛైర్మన్


నమూనాను చూయిస్తున్న అధికారులు

భైంసా: బాసర ఆలయ అధికారులు దేవాదాయశాఖ మంత్రి కొండ సురేఖను మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌కు వెళ్లిన దేవాదాయ శాఖ స్థపతి వల్లినయగం, ఏఈ రామారావు, దేవస్థాన ఛైర్మన్ శరత్‌పాఠక్‌లు మంత్రిని కలిశారు. మంత్రికి అమ్మవారి ప్రసాదాన్ని అందించారు. ఈ సందర్భంగా బాసర ఆలయ మాస్టర్‌ప్లాన్‌ను వివరించారు. మాస్టర్‌ప్లాన్ పరిశీలించిన అనంతరం మంత్రి సురేఖ జిల్లా కలెక్టర్‌తో మాట్లాడినట్లు ఆలయ అధికారులు తెలిపారు. సాధ్యమైనంత త్వరగా బాసర ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభించాలని కోరారు. త్వరలోనే బాసర అమ్మవారి దర్శనానికి రానున్నట్లు మంత్రి తెలిపారని అధికారులు వెల్లడించారు.

పాఠశాల గుర్తింపును రద్దు చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: మావలలోని పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా కార్యదర్శి నవీన్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఒకే పేరుతో కార్పొరేట్ పాఠశాలలు ఓ కంపెనీలా మారాయని అన్నారు. ర్యాంకుల పేరుతో విద్యార్థుల కుటుంబాలను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. నిబంధనలకు విరుద్ధంగా దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన పాఠశాల ప్రిన్సిపల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాల యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నప్పటికీ విద్య శాఖాధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. వెంటనే పాఠశాలను మూసివేయించాలని, లేనియెడల ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు.

కేజీబీవీ దరఖాస్తు ప్రక్రియ

ఆదిలాబాద్‌టౌన్: కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు (కేజీబీవీ)ల్లో ఖాళీగా ఉన్న ఏఎన్ఎం, అకౌంటెంట్, హెడ్‌కుక్, కుక్ పోస్టుల దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో భాగంగా మంగళవారం డీఈవో కార్యాలయంలో ఏఎన్ఎం పోస్టులకు 49మంది అభ్యర్థులు, అకౌంటెంట్ పోస్టుకు 32మంది దరఖాస్తు చేసుకున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ప్రణీత తెలిపారు. హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్ పోస్టులకు సంబంధిత మండలాల ఎంఈవో కార్యాలయాల్లో దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోందని పేర్కొన్నారు. బుధవారంతో దరఖాస్తు ప్రక్రియ ముగియనుందని వివరించారు.

గుర్తు తెలియని వృద్ధురాలు మృతి

ఇంద్రవెల్లి: గుర్తుతెలియని వృద్ధురాలు మృతిచెందిన సంఘటన మంగళవారం మండలంలోని ముత్నూర్ గ్రామంలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై దుబ్బక సునీల్, ముత్నూర్ గ్రామస్తుల వివరాల ప్రకారం... ఏడాదిగా ఓ గుర్తు తెలియని వృద్ధురాలు (80) ముత్నూర్ గ్రామంలో బిచ్చమడుకుతూ జీవిస్తోంది. మంగళవారం ఉదయం ముత్నూర్ గ్రామానికి కొంత దూరంలోని ఓ వ్యాపార దుకాణం ఎదుట మృతిచెంది కనిపించింది. ఎస్సై సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు.

మానవీయతకు పెద్దపీట వేయాలి

- జాతీయ సెమినార్‌లో వక్తలు


హాజరైన ప్రొఫెసర్లు, రీసెర్చ్ స్కాలర్లు


మాట్లాడుతున్న ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్

భైంసాటౌన్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో కృత్రిమ మేధ ప్రాధాన్యం పెరిగిపోయి మానవ సంబంధాలు నానాటికి కనుమరుగవుతున్నాయని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఇలాంటి తరుణంలో ప్రతీఒక్కరు మానవీయతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరముందని నొక్కి చెప్పారు. భైంసాలోని జీఆర్‌పీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం 'మానవీయ సంవేదన, సాహిత్య కే విభిన్న్ స్వర్' అనే అంశంపై ఒకరోజు జాతీయ సెమినార్ నిర్వహించారు. కళాశాలకు చెందిన హిందీ ప్రొఫెసర్ పవన్‌కుమార్ పాండే ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భైంసా ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ హాజరై మాట్లాడారు. భైంసాలో జాతీయస్థాయి సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇలాంటి సదస్సుల్లో వివిధ వర్గాలకు చెందిన మేధావులు పలు అంశాలపై చర్చించడం ద్వారా సమాజ వికాసంతోపాటు భాషా సాహిత్యానికి దోహదపడుతోందన్నారు. అనంతరం ఆయా యూనివర్సిటీల నుంచి వచ్చిన హిందీ విభాగాధిపతులు సంబంధిత అంశంపై మాట్లాడారు. అంతకుముందు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సుధాకర్ రచించిన 'సుశీల టాక్‌భోరే కే సాహిత్య' అనే పుస్తకం ఆవిష్కరించారు. రీసెర్చ్ స్కాలర్లు, ప్రొఫెసర్లు, కళాశాల ప్రిన్సిపాల్ డా ఎం.సుధాకర్, అధ్యాపకులు మధు, మురళీ ఉన్నారు.

అణగారిన వర్గాల గొంతుక...

భారతీయ సమాజంలో నాటి నుంచి అట్టడుగు వర్గాల పట్ల వివక్ష కొనసాగుతోంది. అలాంటి అణగారిన వర్గాల గురించి అంబేద్కర్ తన గొంతుక వినిపించారు. తన రచనల ద్వారా అణగారిన వర్గాలపై చర్చకు తెరతీశారు. ఆయన స్ఫూర్తితో మహారాష్ట్రలోని ఎంతోమంది రచయితలు సాహిత్యాభివృద్ధికి కృషి చేశారు.

– మోహన్ లక్ష్మణ్ చవాన్, హిందీ విభాగం ప్రొఫెసర్, బిట్కో కాలేజ్, నాసిక్ మహారాష్ట్ర

సాహిత్యం కొత్త రూపు సంతరించుకుంటోంది..

మారుతున్న కాలంతోపాటు సాహిత్యం కూడా కొత్త రూపు సంతరించుకుంటోంది. వెయ్యేళ్ల హిందీ సాహిత్యంలో మానవత్వం, సున్నితత్వం సమతుల్యంగా ఉంటున్నాయి. హిందీ సాహిత్యంలో ప్రాచీన కాలం, భక్తి కాలం, ఆచార కాలం, అలాగే ఆధునిక కాలం నాటి మానవ మనోభావాలు పొందుపర్చబడ్డాయి.

– ప్రతిభా యెరేకర్, హిందీ విభాగాధిపతి, లాల్ బహదూర్ శాస్త్రి కాలేజ్, ధర్మాబాద్

బాలింత గుండెకు రంధ్రం

- ఎమ్మెల్యే చొరవతో తప్పిన ప్రాణాపాయం..


కోలుకున్న యశోద

భైంసాటౌన్: పండంటి మగబిడ్డకు జన్మనిచ్చిన ఆ తల్లికి ఆపద వచ్చింది. ఆమెకు గుండెలో రంధ్రం ఏర్పడి శ్వాసనాళాల్లోకి నీరు రావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లగా ఎమ్మెల్యే రామారావు పటేల్ చొరవతో ప్రాణాపాయం తప్పింది. వివరాలిలా ఉన్నాయి.. తానూర్ మండలం జౌల(కె) గ్రామానికి చెందిన యశోద పురిటి నొప్పులతో సోమవారం అర్ధరాత్రి భైంసాలోని ప్రభుత్వ ఏరియాస్పత్రికిలో చేరింది. పరీక్షించిన వైద్యులు ఆపరేషన్ చేయడంతో మగబిడ్డకు జన్మనిచ్చింది. ఈ క్రమంలో శ్వాస సంబంధ సమస్య తలెత్తడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లింది. దీంతో బాధితురాలిని వైద్యులు మొదట హైదరాబాద్ తరలించాలని భావించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు, బాధితురాలి కుటుంబీకులు ఎమ్మెల్యే రామారావుపటేల్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన మహారాష్ట్రకు చెందిన కార్డియాలజిస్ట్ డాక్టర్ అరుణ్‌ను ఫోన్‌లో సంప్రదించి భైంసా ఆస్పత్రికి పిలిపించారు. హుటాహుటిన చేరుకున్న ఆయన ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ కాశీనాథ్‌తో కలిసి పరీక్షించగా ఆమెకు ఇదివరకే గుండెలో రంధ్రం ఉండడంతో శ్వాసనాళాల్లోకి నీరు చేరి ఇబ్బంది తలెత్తినట్లు గుర్తించారు. వెంటనే అవసరమైన చికిత్స అందించగా ప్రస్తుతం ఆమె కోలుకుంది. దీంతో బాలింత కుటుంబీకులు ఎమ్మెల్యేతోపాటు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

భిక్షాటనకు వచ్చి.. చోరీ


చోరీకి గురైన డ్రైనేజీపై మూత


సీసీ ఫుటేజీలో ఇంటి ముందట భిక్షాటకులు

- సీసీ ఫుటేజిల్లో వెలుగుచూసిన దృశ్యం

ఖానాపూర్: పట్టణంలోని రాజీవ్‌నగర్‌కాలనీలో పలువురు వ్యక్తులు భిక్షాటనకు వచ్చారు. కాసేపు గేటు వద్ద వేచి చూసినప్పటికీ లోనికి వెళ్లే మార్గం లేకపోవడంతో చివరకు ఇంటి గేటు ముందు గల డ్రైనేజీపై ఉన్న ఐరన్ మూతను ఎత్తుకెళ్లారు. ఈ దృశ్యాలన్నీ కాలనీలోని సీసీ కెమెరాలో రికార్డు కావడంతో ఇంటి యజమాని జక్క పరిమళ్ కాలనీ వాసులను అప్రమత్తం చేసేందుకు సీసీ ఫుటేజీని సోషల్ మీడియా గ్రూపుల్లో పోస్ట్ చేశాడు. ఇటీవల కాలనీకి చెందిన ఫ్రెండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో సుమారు రూ.2లక్షలతో కాలనీవాసులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన మొదటిరోజే కాలనీలోని రాజేశ్వర్‌గౌడ్ నివాసానికి ఓ దొంగ వచ్చి ఇంట్లో ఏమి లభించక పోవడంతో చివరకు మద్యం బాటిళ్లను ఎత్తుకెళ్లిన దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. తాజాగా ఐరన్ మూత చోరీ చేసిన దృశ్యం కూడా సీసీ కెమెరాలో రికార్డు కావడంతో ప్రజలు అప్రమత్తం అవుతున్నారు. ఈ విషయమై పోలీసుల దృష్టికి తీసుకెళ్లాలని పరిమళ్ తెలిపాడు.

కందులను గిట్టుబాటు ధరలకే అమ్ముకోవాలి


మాట్లాడుతున్న ప్రజ్ఞశీల్

ఉట్నూర్‌రూరల్: రైతులు పండించిన కందులను తొందరపడి మధ్యవర్తులకు తక్కువ ధరలకు అమ్ముకోవద్దని సెర్ప్ ఉట్నూర్ ఎఫ్‌పీ సీఈవో కాంబ్లే ప్రజ్ఞశీల్ రైతులకు సూచించారు. ఉట్నూర్ మండలం చిన్నగంగాపూర్, ఆలిపూర్, కామైపేట్, గంగాపూర్ గ్రామాల్లో సీఈఓ, సీసీలు క్షేత్ర స్థాయిలో పర్యటించారు. అక్కడి రైతులతో సమావేశం ఏర్పాటు చేసిన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నేషనల్ అగ్రికల్చర్ కో– ఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ప్రమాణాలను పాటించడం ద్వారా మంచి ధరలకే తమ పంటలను అమ్ముకోవచ్చని, నేరుగా రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతుందన్నారు. కందులను ఆరబెట్టడం ద్వారా తేమ శాతం 12 శాతం ఉండాలని నాఫెడ్ నాణ్యతా ప్రమాణాలు పాటించి అధిక ధరలకు పంటను అమ్ముకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీసీ జాడిరాజేశ్వర్, వీఓఏ చంపత్‌రావు, లక్ష్మి, చరణ్, పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో పోటీల్లో లక్ష్మీపూర్ విద్యార్థి


విద్యార్థి హరిఓం

జైనథ్: మండలంలోని లక్ష్మీపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థి ఎస్.హరిఓం ప్రతిభ చాటాడు. మాచరాజు బాల సాహిత్య పీఠం హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన బడిపిల్లల కథ పోటీల్లో హరిఓం రాసిన సమయస్ఫూర్తి కథ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పోరెడ్డి అశోక్ మంగళవారం తెలిపాడు. ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా 45మంది విద్యార్థులు కథలు పంపించగా 22 కథలను మాచరాజు బాల సాహిత్య పీఠం వారు ప్రచురణార్థం ఎంపిక చేశారు. త్వరలోనే ఈ కథలతో పుస్తకం తయారు చేయనున్నట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు. విద్యార్థి హరిఓంను ఎంపీటీసీ కామ్రే జయమాల మనోజ్, సర్పంచ్ దాసరి లక్ష్మి రాములు, ఉపసర్పంచ్ గాజంగుల స్వామి, ఉపాధ్యాయులు హన్మంత్‌రావు, నారాయణ, రహీం, మమత గణేశ్ ఇతర గ్రామస్తులు అభినందించారు.

అటవీశాఖ అధికారులకు జింక అప్పగింత


జింక అప్పగిస్తున్న పోలీసులు

తానూరు: గాయాలపాలైన జింకను మంగళవారం అటవీశాఖ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం .. బోల్సా శివారు ప్రాంతంలో జింకను కుక్క వెంబడించడంతో గాయాలపాలైంది. గమనించిన రైతులు జింకను తానూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసులు అటవీశాఖ అధికారుల సమాచారం అందించి వారికి జింక అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. గాయాలపాలైన జింకను బాసరకు తరలించి ప్రథమ చికిత్స అందిస్తామని అటవీశాఖ అధికారులు తెలిపారు. అటవీ శాఖ బీట్ అధికారి మహేశ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

భార్యపై హత్యాయత్నం

ఆదిలాబాద్‌రూరల్: భార్యపై అనుమానంతో బ్లేడ్‌తో గొంతుకోసి హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం అర్ధరాత్రి మండలంలోని భీంసరి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై ముజాహిద్ కథనం ప్రకారం.. భీంసరి గ్రామానికి చెందిన జక్కుల కమల – చంద్రకుమార్ భార్యాభర్తలు. వీరికి ఇద్దరు పిల్లలు. భర్త చంద్రకుమార్ మద్యం తాగి భార్యను అనుమానించేవాడు. ఇదే క్రమంలో సోమవారం అర్ధరాత్రి భార్యను బ్లేడ్‌తో గొంతుకోసి హత్య చేసే ప్రయత్నం చేశాడు. పిల్లలు అప్రమత్తం కావడంతో ఆమె ప్రాణాలతో బయటపడింది. అనంతరం ఆమెను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. మంగళవారం బాధితురాలి ఫిర్యాదు మేరకు భర్తపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపాడు.

రైలు కిందపడి వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

భైంసా: రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు నిజామాబాద్ రైల్వే స్టేషన్ ఎస్సై సాయారెడ్డి తెలిపారు. బాసర రైల్వేస్టేషన్ పరిధిలోని మల్కాపూర్, గుండారం శివారు ప్రాంతంలో రైలు కిందపడి 30–35 ఏళ్ల వయస్సు ఉన్న వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానిస్తున్నారు. మృతుడి వివరాలు ఎవరికైనా తెలిస్తే 94405 16146 నంబరులో సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

నర్సాపూర్(జి): రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందిన సంఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం... మండలంలోని తురాటి గ్రామశివారు పెద్ద చెరువు సమీపంలోని 61వ జాతీయ రహదారిపై మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా బురక్ వాడీ గ్రామానికి చెందిన రవి శివాజీ గమేవాడ్ (24) ద్విచక్ర వాహనంపై నిర్మల్ వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలై రక్తస్రావంతో మృతిచెందాడు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి మృతదేహాన్ని నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. లారీ డ్రైవర్ పరారీ కాగా క్లీనర్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు ఎస్సై రవీందర్ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు


గాయపడిన యువకుడు

దిలావర్‌పూర్: మండలంలోని గుండంపల్లి గ్రామంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఇందులో మండలంలోని కాండ్లి గ్రామానికి చెందిన గుమ్ముల గణేష్, మహారాష్ట్రకు చెందిన శంకర్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు... కాండ్లి గ్రామానికి చెందిన గుమ్ముల గణేష్ అనే యువకుడు పని నిమిత్తం ద్విచక్రవాహనంపై నిర్మల్ వెళ్తున్నాడు. మహారాష్ట్రకు చెందిన శంకర్‌తో పాటు మరో వ్యక్తి ద్విచక్రవాహనంపై గుండంపల్లికి వేగంగా వస్తూ ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో గణేష్‌తో పాటు శంకర్‌కు తీవ్రంగా, మరో యువకుడికి స్వల్పగాయాలయ్యాయి. గణేష్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు స్థానికులు వెల్లడించారు. అలాగే ఎస్సై యాసిర్ అరాఫత్‌ను వివరణ కోరగా తమ దృష్టికి వచ్చిందని, బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని వెల్లడించారు.

రైల్వేస్టేషన్ అభివృద్ధికి చర్యలు

- వేగవంతంగా పిట్‌లైన్ పనులు
- ఎస్‌సీఆర్ ఏజీఎం ధనుంజయులు


రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న ఏజీఎం

ఆదిలాబాద్: అమృత్ భారత్ పథకం కింద ఎంపికైన ఆదిలాబాద్ రైల్వేస్టేషన్ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని దక్షిణ మధ్య రైల్వే ఏజీఎం ఆర్.ధనుంజయులు అన్నారు. జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్‌ను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనుల ప్రణాళికలను గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల రైల్వే ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన హెల్త్ యూనిట్‌ను సందర్శించిన ఆయన పిట్‌లైన్ పనుల పురోగతి వివరాలను గురించి ఆరా తీశారు. రైల్వే స్టేషన్‌లో సమకూర్చాల్సిన వసతుల గురించి అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ అమృత్ భారత్ పథకం కింద ఆదిలాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులకు నిధులు మంజూరయ్యాయన్నారు. పిట్‌లైన్ పనులు పురోగతిలో ఉన్నాయని, రాబోయే కొన్ని నెలల్లో పూర్తిచేస్తామన్నారు. రైల్వే స్టేషన్‌లో 12 మీటర్ల వెడల్పుతో మరో ఫుట్ ఓవర్ బ్రిడ్జి, మూడు లిఫ్టులు నిర్మిస్తామన్నారు. ఆగస్టు నాటికి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.

కుమురంభీం ప్రాంగణాన్ని తీర్చిదిద్దాలి


పనులు ప్రారంభిస్తున్న పీవో


సమావేశంలో ఆయా శాఖల అధికారులు

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని కుమురం భీం ప్రాంగణాన్ని (కేబీ కాంప్లెక్స్)ను సుందరంగా తీర్చిదిద్దాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కేబీ కాంప్లెక్స్‌లో రాజమండ్రి నుంచి తెప్పించిన అరుదైన మొక్కలు నాటి సుందరీకరణ పనులను శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మహతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ.. కుమురంభీం కాంప్లెక్స్ ద్వారం నుంచి విగ్రహం వరకు, పరిసరాలు, పీఎంఆర్సీ గెస్ట్‌హౌజ్, మీటింగ్ హాల్ పరిసరాల్లో అలంకరణ, పూల మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. రాజమండ్రి నుంచి తెప్పించిన పలు మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. త్వరలో ఉట్నూర్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి ఇంటర్ సొసైటీ స్పోర్ట్స్ లీగ్ పనులను త్వరి తగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఈ రాథోడ్ భీంరావు, పీహెచ్‌వో సందీప్ కుమార్, జిల్లా క్రీడా అధికారి పార్థసారథి పాల్గొన్నారు.

ఇంటర్ సొసైటీ లీగ్ పోటీలను పకడ్బందీగా నిర్వహించాలి

ఉట్నూర్‌రూరల్: ఇంటర్ సొసైటి లీగ్ క్రీడా పోటీలను పకడ్బందీగా నిర్వహించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిణి చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఐటీడీఏ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఇంటర్ సొసైటి లీగ్ (ఐఎస్ఎల్) క్రీడా పోటీల నిర్వాహణపై సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ నెల 17 నుండి 20 వరకు నిర్వహించే ఐఎస్ఎల్ పోటీలకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఘనంగా నిర్వహించాలన్నారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని తెలిపారు. సమావేశంలో శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మహతో, డీడీ దిలీప్‌కుమార్, గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల డీటీడీఓలు రమాదేవి, అంబాజీ, గంగారాం, ఏవో రాంబాబు పాల్గొన్నారు.

ఆహ్లాదకర వాతావరణంతోనే ప్రశాంతత

- ఆర్టీసీ ఉమ్మడి జిల్లా రీజినల్ మేనేజర్ సోలోమన్


ఉద్యోగులకు వడ్డన చేస్తున్న రీజనల్ మేనేజర్

ఆదిలాబాద్: ఆహ్లాదకర వాతావరణంతోనే మానసిక ప్రశాంతత సాధ్యమని ఆదిలాబాద్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సోలోమన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో మంగళవారం వనభోజన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులకు ప్రత్యేక భోజన వసతిని కల్పించారు. అదేవిధంగా ఆర్టీసీ ఉద్యోగులకు క్రీడా పోటీలను ఏర్పాటు చేయగా, వారు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రీజినల్ మేనేజర్ సోలోమన్ మాట్లాడుతూ ఉద్యోగుల్లో ఉత్తేజాన్ని పెంపొందించాలనే ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ఉద్యోగులందరూ ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొనేలా కృషి చేశామన్నారు. ఉద్యోగులందరూ స్నేహపూర్వక వాతావరణంలో మెలగాలని సూచించారు. విధి నిర్వహణలో ఒత్తిడి సహజమని ఒత్తిడిని దూరం చేయడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. డీటీసీ పుప్పాల శ్రీనివాస్, ఆదిలాబాద్ డిపో మేనేజర్ కల్పన తదితరులున్నారు.

మంత్రిని కలిసిన సెకండ్ ఏఎన్ఎంలు


వినతిపత్రాన్ని అందిస్తున్న సెకండ్ ఏఎన్ఎంలు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో పనిచేస్తున్న సెకండ్ ఏఎన్ఎంలు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిశారు. మంగళవారం హైదరాబాద్‌లో కలిసి సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఏఎన్ఎంలు మాట్లాడుతూ నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న తమను రెగ్యులర్ చేయాలని పేర్కొన్నారు. దీంతో పాటు ఇతర సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన మంత్రి వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పి.మమత, జె.పద్మ, ఎస్.వసంత, డి.సుజాత, ఎం.రాజశ్రీ, ధనలక్ష్మి పాల్గొన్నారు.

సర్వేను అడ్డుకున్న గొండుగూడ వాసులు


స్థానికులతో మాట్లాడుతున్న సర్వేయర్లు

కడెం: మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ పంచాయతీ పరిధిలోని పెత్తర్పు సమీపంలో ఆటవీ భూమిని సర్వే చేసేందుకు వచ్చిన సర్వేయర్లను గొండుగూడ వాసులు అడ్డుకున్నారు. పునరావాస ప్యాకేజీలో భాగంగా రాంపూర్, మైసంపేట్ గ్రామాల్లోని 94 కుటుంబాలకు వ్యవసాయ భూమిని అప్పగించేందుకు సర్వే నిర్వహిస్తున్నారు. పోడు వ్యవసాయం కోసం ఈ భూములను తాము ఇరవై ఏళ్ల క్రితమే చెట్లు నరికి పోడు సాగు చేస్తున్నామని, రాంపూర్, మైసంపేట్ వాసులతో పాటుగా గొండుగూడలోని ఇరవై కుటుంబాలకు భూములు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ భూములు మీ కోసమే సర్వే చేస్తున్నామని గొండుగూడ వాసులకు సర్వేయర్లు నచ్చచెప్పి గ్రౌండ్ లెవెల్ సర్వే చేశారు. ఇందులో రాజ్‌గొండ్ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఆత్రం రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి ఆత్రం భీంరావు, దస్తురాబాద్ మండలాధ్యక్షుడు రాజేందర్, కుర్సెంగ దేవు, మహేశ్, లక్ష్మణ్, పాండురావు ఉన్నారు.

ప్రతిభ కళాశాలల ప్రవేశం నోటిఫికేషన్ విడుదల

ఆదిలాబాద్‌రూరల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభ కళాశాలల్లో (సీవోఈ–సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కళాశాలలు) 2024–25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైందని ఆదిలాబాద్ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్, డీసీవో శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని 38 ప్రతిభ గురుకుల కళాశాలల్లో ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానించడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఈ నెల 15వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కళాశాలల్లో జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్, నీట్, ఎంసెట్, క్లాట్, సీఎంఏ వంటి పోటీ పరీక్షలకు అత్యుత్తమ శిక్షణ అందిస్తారని తెలిపారు. విద్యార్థులకు ఉచిత భోజన, వసతి సౌకర్యాలతో పాటు స్టడీ మెటీరియల్ అందిస్తారని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్షలో ప్రతిభ ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాల్లో 5వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 20 వరకు పొడిగించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సల్లంబల సందడి..!


పూనకాలతో శివసత్తులు

కుంటాల: మండలంలోని ఓలా గ్రామంలో ఇటీవల శ్రీ వీరాంజనేయ, పెద్దమ్మ తల్లి, రేణుక ఎల్లమ్మ విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా మంగళవారం గ్రామంలో సల్లంబల సందడి నెలకొంది. మహిళలు నెత్తిన బోనాలతో ఊరేగింపుగా ఆలయాలకు చేరుకున్నారు. అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.